ఆశాజనకం.. ఆయిల్‌పాం సాగు

- 90 శాతం సబ్సిడీతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- నాలుగేళ్ల క్రితం సాగుచేసిన రైతులకు ఆదాయం ఆరంభం



రైతు జగన్‌మోహన్‌రెడ్డి సాగుచేసిన ఆయిల్‌పాం తోట



పెద్దాపూర్‌లో ఆయిల్‌పాం గెలలను చూపిస్తున్నరైతులు

ఉప్పునుంతల: సాధారణ పంటలు వేసుకుంటే కూలీల కొరత, పెరిగిన పెట్టుబడితో వేసారి పోయిన రైతులకు తొంభైశాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆయిల్ పాం తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాలుగేళ్ల కిందట మొక్కలు నాటుకున్న తోటలు ప్రస్తుతం ఆశాజనంగా ఉన్నాయి. కొంత మంది రైతులకు పంట చేతికొచ్చి ఆదాయం రావడం ప్రారంభమైంది. మరికొంతమంది రైతులు మొక్కల ఎదుగుదల కోసం వచ్చిన గెలలను తెంచుతున్నారు. ఈ ఏడాది చివరి వరకు ఆయిల్‌పాం పంట రాబడి ఊపందుకునే అవకాశం ఉంది. మండలంలో గత నాలుగేళ్ల క్రిందట ఆయిల్‌పాం తోటల సాగును మొదలుపెట్టారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో 151 మంది రైతులు 629 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలను సాగు చేశారు. మొదలు వేసుకున్న తోటలకు గెలలు కాస్తున్నాయి. ఒకరిద్దరు రైతులు గెలలు తెంపి కంపెనీకి అమ్ముకున్నారు. తక్కువ పెట్టుబడి, నిర్వహణతో ఇక నుంచి 35 ఏళ్ల పాటు నిరంతరంగా రైతులు ఆదాయం పొందనున్నారు. మొదట వేసుకున్న తోటల దిగుబడి, వచ్చే ఆదాయం చూసి మరికొంతమంది రైతుల ఆయిల్‌పాం తోటలు వేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు.

ఆయిల్‌పాం తోటలకు 90శాతం సబ్సిడీ..

ఆయిల్‌పాం తోటల సాగుకు రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా 90శాతం సబ్సిడీ అందిస్తోంది. ఒక్కో రైతుకు 5 ఎకరాల వరకు తోట పెంపకంకోసం సబ్సిడీ అందిస్తున్నారు. ఎకరాకు 50 మొక్కల వరకు ఆయిల్ పాం మొక్కలు నాటుకోవాలి. మొక్కల కొనుగోలు నుంచి సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నారు. చిన్న సన్నకారు రైతులకు మాత్రం 12 ఎకరాల వరకు 80శాతం సబ్సిడీ ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. నాలుగేళ్లపాటు ఎకరాకు ఆయిల్ పాం మొక్కలతో పాటు అంతర పంటల సాగుకు నిర్వాహణ ఖర్చుల నిమిత్తం రూ.4200లు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. రైతులు మార్కెటింగ్‌కు ఇబ్బందిపడకుండా పంట కొనుగోలు చేయడానికి కంపెనీ వారితో ఒప్పందం చేశారు. ఎకరాకు రూ.50 వేల వరకు ప్రభుత్వం ఖర్చుచేస్తోంది. పంట చేతికొచ్చే సమయంలో వాటికి ఎలాంటి చీడపీడలు, కోతులు, పక్షులు వంటి వాటి నుంచి ఎలాంటి నష్టం ఉండదు. దీంతో పాటు గాలి, వర్షంలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉండదు. పక్వానికి వచ్చిన గెలలను తెంచుకొని నేరుగా ఒప్పందం చేసుకున్న కంపెనీ వారికి నేరు విక్రయించుకునే అవకాశం ఉంది.

తొమ్మిది ఎకరాల్లో సాగు చేశా..



మూడేళ్ల క్రితం తొమ్మిది ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటాం. సారవంతమైన పొలం కావడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. మొక్కలు బాగా ఎదగాలనే లక్ష్యంతో ఇప్పటికే నాలుగైదు సార్లు వచ్చిన గెలలను తొలిదశలోనే తెంచాం. మరో ఆరు నెలలకు మొదటి పంట చేతికొస్తుందని అనుకుంటున్నాం. తోట నిర్వాహణలో ఎలాంటి ఇబ్బందిలేదు. సమీపంలో ఆయిల్ పాం గెలలను అమ్ముకోవడానికి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– తిప్పర్తి జగన్‌మోహన్‌రెడ్డి, రైతు, ఉప్పునుంతల

మూడేళ్లు మొక్కలు కాపాడుకోవాలి..



ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని మూడేళ్లపాటు మొక్కలు సద్వినియోగం చేసుకుంటే ఇక ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏటా ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. ఈ ప్రాంతంలో ఎకరాకు ప్రతియేటా 11 నుంచి 14 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను గెలలకు రూ.17,463లు ఉంది. అచ్చంపేట డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో 500ల మందికి పైగా రైతులు 1936 ఎకరాల్లో ఆయిల్ పాం తోటలను సాగు చేశారు.

– చంద్రశేఖర్, ఉద్యానవన శాఖాధికారి, అచ్చంపేట డివిజన్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చారకొండలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



లింగాలలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

చారకొండ/లింగాల/బల్మూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తు కేబినేట్ తీసుకున్న నిర్ణయంపై శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చారకొండలోని అంబేద్కర్ సర్కిల్, లింగాల మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ చిత్రపటాలకు, బల్మూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. చారకొండ, బల్మూరు మండలాల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి మహేందర్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరటి శివ, కుకుడాల శ్రీనివాసులు, కందికంటి శ్రీను, లక్ష్మణ్ పర్వతాలు, శివ, కుర్వ శ్రీశైలం, రాజల్, కాశన్న యాదవ్, సుధాకర్‌గౌడ్, రాంప్రసాద్‌గౌడ్, సంపంగి రమేష్, కొండాశివగౌడ్, మదనాచారి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, ఆంజనేయస్వామి దేవాయాల నిర్మాణాలకు గ్రామానికి చెందిన గోలి కృష్ణారెడ్డి వ్యక్తిగతంగా శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు చెక్కు పంపిణీ చేశారు. ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అల్లె సందీప్, శశిధర్, గౌరీశంకర్, రామచంద్రయ్య, రమేష్, లాలయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన హమాలీ బాలీశ్వరయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. 1995–96 సంవత్సరంలో 10వ తరగతి పూర్వ విద్యార్థులు డబ్బులను పోగు చేసుకొని శనివారం మృతుడి భార్య లక్ష్మికి రూ.లక్ష అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ, బాలమల్లయ్య, చంద్రయ్య, తిరుపతయ్య, ప్రభాకర్, రాఘవేందర్, బి.మల్లయ్య, శ్రీధర్, ఖాజా, రాముడు, ఎల్లయ్య, ఖరీం పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న పదవ తరగతి పూర్వ విద్యార్థులు

క్లుప్తంగా

వెంకటాపూర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై తనిఖీ



బిజినేపల్లి: మండలంలోని వెంకటాపూర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ టీం పారిశుద్ధ్యం కార్యక్రమం అమలు తీరుపై ఎంపీడీఓ కథలప్ప బృందం ప్రత్యేకంగా తనిఖీ చేశారు. శనివారం గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ తీరు, మరుగుదొడ్ల వినియోగం, పాఠశాలలో మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అధికారుల బృందం సభ్యులు వెంకటేష్, వేంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, రామ్మోహన్, కళావతి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రకల్ గ్రామానికి చెందిన లక్ష్మికి వైద్య ఖర్చుల కోసం మంజూరైన రూ.39 వేల సీఎం సహాయనిధి చెక్కును దేవయ్యకు కాంగ్రెస్ నాయకులు బంగారయ్య శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పేదల ఆరోగ్యం కోసం నిధులు మంజూరు చేసి ఆదుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు, రవీందర్ పాల్గొన్నారు

బస్సు ప్రారంభం



వెల్దండ: మండలంలోని బైరాపూర్ నుంచి సంతోష్ నగర్‌కు శనివారం ఆర్టీసీ అధికారులు బస్సును మంజూరు చేశారు. సంతోష్‌నగర్ నుంచి ఉదయం 11.25 గంటలకు బయలుదేరి వెల్దండ మీదుగా బైరాపూర్‌కు మధ్యాహ్నం 2.10 గంటలకు చేరుకుంటుందని తిరిగి సంతోష్‌నగర్ వెళ్తుందని ఆర్టీసీ అధికారులు వివరించారు. బైరాపూర్ గ్రామస్తులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు బస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిపో మేనేజర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



కల్వకుర్తి రూరల్: కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. శనివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 110 మంది ఆపరేషన్లు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా శిబిరంలో 8000 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు 450 మందికి ఆపరేషన్లు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీరాములు, యూసుఫ్ బాబా, నరేందర్ గౌడ్, గణేష్, రఘు, శ్రీపతి, శివ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల నుంచి రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని తహసీల్దార్ కార్తీక్ కుమార్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రెండో శనివారం సెలవు దినం ఉన్నప్పటికి సిబ్బందితో సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అవగాహన కల్పించారు. మండలంలోని 16 రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 363 దర ఖాస్తులు వచ్చినట్లు వివరించారు. వచ్చిన దరఖాస్తుల్లో మిస్సింగ్ సర్వే నెంబర్లు, అసైన్‌మెంట్, విరాసత్, తదితర వివరాలను తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సగానికి పైగా పరిష్కరించినట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేదినాటికి అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కంప్యూటర్ల ద్వారా సిబ్బంది పనులను చేట్టారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐలు శంకర్, శైలజ, సిబ్బంది తదితరులు ఉన్నారు.



పాఠశాల అభివృద్ధిపై సమావేశం



బిజినేపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం సమావేశమయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి గురుకులంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబుద్ధులు, భోజనాలు, పాఠ్య పుస్తకాలు వంటి వాటి గురించి వివరించారు. పాఠశాల చైర్మన్ శంకర్, వైస్ చైర్మన్ విజయ్ కాంత్‌లు గురుకుల పాఠశాల అభివృద్ధిపై కార్యాచరణ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు సిబ్బంది ఉన్నారు.

'బీసీ రిజర్వేషన్లు స్వాగతిస్తున్నాం'



కల్వకుర్తి టౌన్: రాష్ట్ర మంత్రి వర్గం బీసీలు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో బీసీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమిళనాడు తరహాలో కేంద్రంపై ఒత్తిడి పెంచి అమలుచేసేలా చూడాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, రాజ్యాంగ సవరణ ద్వారానే రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగుమవుతుందన్నారు. బీసీ నాయకులు పెద్దయ్య, మాజీ సర్పంచ్ జంగయ్య, గోపాల్, సైదులు, నాయకులు పాల్గొన్నారు.

'ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేయాలి'

మన్ననూర్: తెలంగాణలో రానున్న స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకుడు సంబు వెంకటరమణ కోరారు. శనివారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ, మున్సిపల్, గ్రేటర్ ఎన్నికల్లో లేని నిబంధనను ఒక్క స్థానిక ఎన్నికల్లో అమలు చేయడం సరికాదన్నారు. గ్రామీణ నాయకత్వాన్ని కట్టడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిబంధన అమలు చేశారని ప్రస్తుతం రాష్ట్రం విడిపోయాక ఏపీలో ఆ నిబంధన తొలగిస్తే తెలంగాణలో మాత్రం కొనసాగించడంపై పునరాలోచించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఏజెన్సీ ప్రాంతాలలో సర్పంచ్ పదవులు పూర్తిగా ఎస్టీలకు మాత్రమే పరిమితం (రిజర్వ్‌డ్) కాకుండా జనాభా దామాషాను పరిగణలోకి తీసుకొని ఇతరులకు కనీసం 10 శాతం అయినా కేటాయించాలని కోరారు. ఇదిలా ఉండగా అమ్రాబాద్ మండలంలో ఒక్క గిరిజన కుటుంబం కూడా లేని గ్రామాన్ని కూడా ఏజెన్సీ గ్రామంగా గుర్తించడంతో ప్రశాంతి నగర్, కుమ్మరోనిపల్లి, వంగురోనిపల్లి, కల్ములోనిపల్లి గ్రామాల్లో కొంత కాలంగా సర్పంచ్ పదవులకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రహీం, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, జాకీర్, షరీఫ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

బీటీరోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండలంలోని చెదురుపల్లి నుంచి బుగ్గకాల్వతండా వరకు బీటీరోడ్డు నిర్మించాలని కోరుతూ శనివారం చెదురుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు జక్కుల శ్రీనివాస్‌యాదవ్ హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. చెదురుపల్లి గ్రామం నుంచి బుగ్గకాల్వతండాకు మూడు కిలో మీటర్ల దూరం ఉంటుందని ఏళ్లుగా తండావాసులు బీటీరోడ్డు కోసం ఎదురుచూస్తున్నట్లు వివరించారు. బీటీ రోడ్డు ఏర్పాటైతే చారకొండ మండలం గోకారం, ఎర్రవల్లి, ఎర్రవల్లితండా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. అధికారులతో సర్వే చేసి రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తండావాసులు పేర్కొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో 1998–99 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని కుటుంబ, ఉద్యోగ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

అగ్రహారం తండాలో విషాదచాయలు

చారకొండ: రంగారెడ్డి జిల్లా మహేశ్వరంగేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని అగ్రహారం తండాకు చెందిన యువకుడు మృతి చెందడంతో తండాలో విషాదచాయలు అలుముకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం అగ్రహారం తండాకు చెందిన నేనావత్ వర్షిత్ నాయక్(21) శుక్రవారం ఉదయం కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మహేశ్వరం గేట్ వద్ద ఎదురుగా వస్తున్న డీజిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. వర్షిత్ ఇటీవల మద్రాస్ యూనివర్సిటీలో ట్రిపుల్ ఐటీ పూర్తి చేశాడు. శనివారం గ్రామంలో మధ్యాహ్నం కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు పూర్తయ్యాయి.

లక్ష్య సాధనలో ముందుకు వెళ్లాలి



లింగాల: లక్ష్య సాధనలో ముందుకు వెళ్లాలని ప్రేరణ విద్యా ఉద్యమ వ్యవస్థాపకులు మోటివేషనల్ స్పీకర్ నాగిల్ల శ్రీశైలం విద్యార్థినులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో శనివారం ప్రేరణ తరగతులను నిర్వహించారు. చదువు ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌తో కలిగే అనార్థాలను వివరించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. పాఠశాల ప్రత్యేకాధికారి శారద, ఉపాధ్యాయులు పార్వతి, రాధిక, పరమేశ్వరి, అర్చన, ఉమాదేవి, రజిత, ప్రమీల, పద్మ, లోకమ్మ, రేణుకమ్మ, జ్యోతి, అలివేల, మాధవి, సాయిలీల, అనిత, స్వేత, విద్యార్థినులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

బల్మూర్: మండల కేంద్రం నుంచి గోదల్ రూట్లో బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సును రద్దు చేయడంతో తుమ్మెన్‌పేట, కొండారెడ్డిపల్లి, కొత్తపల్లి, గోదల్ గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మండల కేంద్రంలోని కార్యాలయాలు, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు నిత్యం అవస్థలు పడుతున్నారు. కేవలం నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి రావాలంటే బస్సు సౌకర్యం లేక పోవడంతో చుట్టు అచ్చపేట మీదుగా 30 కిలో మీటర్ల దూరం ప్రయాణించి కార్యాలయాల పనుల నిమిత్తం రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గోదల్–బల్మూర్ రూట్లో బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పెంట్లవెల్లి: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని ఎస్ఐ రామన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సైబర్‌నేరాలపై అవగాహన ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం అపరిచితులకు చెప్పొద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజన్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ సేవలకు దివ్యాంగుడికి అవార్డు

కొల్లాపూర్: కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) సేవలకు పట్టణానికి చెందిన దివ్యాంగుడు ముస్తాఖ్‌కు సెర్ప్ అధికారులు అవార్డు అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ఐటీ ఈఅండ్‌సీ డిప్యూటీ సెక్రెటరీ భవేష్ మిశ్రా, ఈ సర్వీస్ డెలివరీ అండ్ మీసేవ కమిషనర్ తాడి రవికిరణ్, సెర్ప్ అదనపు సీఈఓ కాత్యాయని దేవిలు అవార్డు అందజేశారు. దివ్యాంగుడు కావడంతో ఇంటినుంచే సీఎస్‌సీ సేవలు అందించేందుకు ఆయనకు వెసులుబాటు కల్పించారు.

ఘనంగా ఆది జాంబవ మహారాజ్ జయంతి

లింగాల: మాదిగల మార్గదర్శకుడు ఆది జాంబవ మహారాజ్ జయంతిని శనివారం మండలంలోని కొత్తచెర్వుతండాలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల కన్వీనర్ కవిరామ్ మహారాజ్, కృష్ణయ్య, చింతకుంట్ల కృష్ణయ్య, సైదులు, రాముడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పెద్దపల్లి గ్రామస్తులు

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. దాదాపు రూ. 2 కోట్లపైన పెద్దపల్లి నుంచి మర్రికల్ బీటీ రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ సత్యపాల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బాలస్వామి సుల్తాన్ పర్వతాలు, నర్సింహరావు, మహేష్, సురేష్, జగదీశ్వర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ప్రమాదం

వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో హెల్పర్ రవి నిర్లక్ష్యంతోనే రైతు మల్లేష్ తీవ్రగా గాయపడ్డాడని బాధిత కుటుంబసభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల ఇలా ఉన్నాయి. ఈ నెల 5న రైతు మల్లేష్ వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జంపర్ వైరు తెగిపోయింది. జంపర్ వైరు వేయాలని హెల్పర్ రవికి రైతు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. విద్యుత్ సరఫరా నిలిపివేశానని, జంపర్ వైరు సరిచేసుకోవాలని చెప్పడంతో రైతు మల్లేష్ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి వైరు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. రైతు మల్లేష్‌కు వెన్నుముక విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అధికారులు పూర్తి విచారణ చేసి హెల్పర్ రవిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరారు.

స్వామివారికి వెండి ఆభరణాలు బహూకరణ

తిమ్మాజీపేట: లక్ష్మీనర్సింహ స్వామికి శనివారం ఆర్మీ జవాన్ సోమేశ్వర్ వెండి ఆభరణాలు బహూకరించాడు. మండలంలోని అప్పాజీపల్లి గ్రామానికి చెందిన సోమేశ్వర్ ఇటీవల సైన్యంలో సైనికుడిగా ఉద్యోగం సంపాదించాడు. తన మొదటి నెల వేతనం రూ.20116 తో గ్రామా సమీపంలో గుట్టపై స్వయంభూగా వెలసిన లక్ష్మీనర్సింహ స్వామికి కళ్లు, కోర మీసాలు చేయించి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు భాస్కర్‌రెడ్డి, సురెందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్రెడ్డి, దామోదర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

అచ్చంపేట రూరల్: అచ్చంపేట డివిజన్ క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో స్థానిక ఎంబీ చర్చి ఆవరణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీసాల సుధాకర్, కార్యదర్శిగా బొంత ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడిగా ఈజీ జేమ్స్, ఉపాధ్యక్షుడిగా బాలయ్య, సహాయ కార్యదర్శిగా వరప్రసాద్, కోశాధికారిగా సుందర్‌రాజ్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మల్లేష్, పాస్టర్లు పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు



అచ్చంపేట రూరల్: ఆషాఢమాసం గోరింటాకు సంబరాలను మహిళలు ఘనంగా జరుపుకుంటున్నారు. శనివారం పట్టణంలోని సాయినగర్ కాలనీలో మహిళలంతా ఒక చోట గుమిగూడి స్వయంగా గోరింటాకు మెహందీని తయారు చేసుకున్నారు. గోరింటాకు విశిష్టతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉమ, అనురాధ, రాధిక, సుధ, సరిత, అరుణ పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: దళిత కాలనీలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కేవీపీఎస్ ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పుల్జాల దళితవాడను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవాడలలో మురుగు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. వైద్యధికారులు గ్రామాలలో సందర్శించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి రోగాలబారిన పడకుండా చూడాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ

తాడూరు: మండల కేంద్రంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాల తనిఖీలో భాగంగా ఎస్ఐ గురుస్వామి వాహనదారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు లైసెన్సుతోపాటు, వాహనాలకు సంబందించిన అన్ని రకాల వెంట ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే వాహన యాజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అతి వేగాన్ని తగ్గించి, సరైన క్రమంలో నడిపితే ప్రమాదాలకు గురి కాకుండా ఉండే అవకాశం ఉందని తెలిపారు.